# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 173

VEKUVA SAMAYAM TELUGU DAILY

⁎ Mahabubnagar ⁎ Hyderabad ⁎ Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: ఆదివారం 19 జూలై 2026








## నా కుటుంబానికి పెద్దన్న అందెశ్రీ

**సమయం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ స్మృతివనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు.




## బండి సంజయ్, ఈటల మధ్య కుదిరిన సయోధ్య

**సమయం ప్రతినిధి :** తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.




## భారీ పేలుడు.. 8 మంది మృతి..

**సమయం ప్రతినిధి:** అహ్మదాబాద్‌లోని ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. రామోల్-గట్రాడ్ రోడ్డులోని కర్మాగారంలో ప్రమాదం జరిగి 8 మంది మృతిచెందగా.. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల్లో నలుగురిని ఎల్జీ ఆస్పత్రికి తరలించిన సహాయక సిబ్బంది.. మరో ముగ్గురిని అసర్వా సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వస్త్రాల్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ శిబిరం వెనుకే ఆ ఫ్యాక్టరీ ఉంది. పేలుడు శబ్దం విన్న వెంటనే శిబిరంలోని సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక బృందాలు రాకముందే సహాయక చర్యలు ప్రారంభించారు. బాధితులను ఆస్పత్రులకు తరలించడంతో పాటు శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించారు. అనంతరం ఘటనాస్థలికి ఐదు అగ్నిమాపక వాహనాలతో ఫైర్ సిబ్బంది చేరుకున్నారు. తీవ్రంగా శ్రమించి ఎట్టకేలకు మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన అధికారులు బాణసంచా కర్మాగారానికి ఎలాంటి అనుమతులు లేవని నిర్ధారించారు. ఈ పేలుడుతో భారీ ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లిందని వారు వెల్లడించారు. కాగా, పేలుడు ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు స్థానికులు తెలిపారు. ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించడంతో స్థానికంగా భయాందోళనలు రేకెత్తినట్లు పేర్కొన్నారు. పేలుడు ధాటికి శబ్దం దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం వరకు వినిపించిందని వారు వెల్లడించారు.

## ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి మహ్మద్ అజహరుద్దీన్




**రంగారెడ్డి, జూలై 18 (సమయం ప్రతినిధి):** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంత్రి సందర్శించి విద్యా, క్రీడా, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై ప్లేగ్రౌండ్‌లో కాసేపు క్రికెట్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాలమైన క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ వంటి క్రీడా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం లభిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం అవసరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించాలని, తల్లిదండ్రుల త్యాగాలను గుర్తుంచుకోవాలని, ఓటమికి నిరాశ చెందకుండా నిరంతర సాధనతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఏర్పడే స్నేహాలు జీవితాంతం నిలుస్తాయని, పరస్పర గౌరవం, సహకారం, ముఖ్యంగా బాలికలను గౌరవించే సంస్కారాన్ని అలవర్చుకోవాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, మంచాల్ తహశీల్దార్, ఆరుట్ల సర్పంచ్ శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

## నీట్ టాపర్లు, ఆసియా స్వర్ణ పతక విజేత సాయి ప్రవల్లికను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, సమయం ప్రతినిధి (జులై 18):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంగళవారం మహాత్మా గాంధీ క్యాంపస్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయం (MCRHRD)లో గురుకుల పాఠశాలల విద్యార్థులను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ గిరిజన సామాజిక సంక్షేమ నివాస విద్యా సంస్థలు (TGSWREIS)లో చదివి చీజుజు-2026లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను మరియు తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4ఐ400 మీటర్ల రిలే పోటీలో స్వర్ణ పతకం సాధించిన సాయి ప్రవల్లికను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విద్యార్థులతో సంభాషించి, వారి సాధనలను ప్రశంసించారు. గురుకుల విద్యా సంస్థలు తెలంగాణ ప్రభుత్వం యొక్క గౌరవప్రదమైన పథకమని, పేదలు, బలహీన వర్గాల విద్యార్థులు కూడా ఉన్నత స్థాయి విజయాలు సాధించేలా అంకురార్పణ చేస్తున్నాయని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సామాజిక సంక్షేమ శాఖ (SCDD) ముఖ్య కార్యదర్శి విజయేంద్ర బోయి, TGSWREIS కార్యదర్శి కంభంపాటి శారద, జాయింట్ సెక్రటరీ (అకాడమిక్) సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు. గురుకుల విద్యార్థులు సాధించిన ఈ విజయాలు తెలంగాణలోని ప్రభుత్వ విద్యా వ్యవస్థ యొక్క బలాన్ని మరోసారి నిరూపించాయని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## టీఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితని కలిసిన గొంగళ్ళ రంజిత్

- రంజిత్ కుమార్‌తో పాటు కవితని కలిసిన గద్వాల టీఆర్ఎస్ పార్టీ నాయకులు




**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ని గద్వాల నియోజకవర్గ ఇంచార్జి గొంగళ్ళ రంజిత్ కుమార్ తో పాటు గద్వాల పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి గద్వాల నియోజకవర్గ ఇంచార్జిగా కీలక బాధ్యతలు అప్పగించినందుకు రంజిత్ కుమార్ కవిత కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. పార్టీ ఆశయాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గద్వాల నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

# సంపాదకీయం

## దళితబహుజన వాదానికి కొత్త పిలుపు

అడకత్తెరలో పోకచెక్క అనే సామెత ఉంది. ముందు నుయ్యి, వెనుక గొయ్యి అనే సామెత కూడా ఉంది. ప్రస్తుతం ఈ సామెతలు అన్వయించే క్లిష్ట సందర్భంలో 'హిందూ దళిత బహుజనులు' ఉన్నారు. దళిత బహుజన పౌరులందరూ నాస్తికులు కారు. వారికి మతం గురించిన ఆసక్తులు ఉంటాయి. వారు తమ మతాసక్తులు దెబ్బతినకుండా కాపాడుకోవడంలో ఏ తప్పూ లేదు. హిందూ దళిత బహుజనుల ఆసక్తులు రెండు: ఒకటి మతం, రెండు సామాజిక న్యాయం. కానీ హిందూ దళిత బహుజనులు ఈ రెండు ఆసక్తులనూ నెరవేర్చని రెండు భిన్న భావజాలాల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. వాటిల్లో ఒకటి ఆరెస్సెస్ హిందూ భావజాలం, రెండవది లౌకికవాద నాస్తిక దృక్పథం. ఈ రెండు దృక్పథాలు వారిలోని ఒక ఆసక్తిని నెరవేరిస్తే, ఇంకొక ఆసక్తిని నెరవేర్చే పరిస్థితి లేదు. హింసను ఎదుర్కోవడం పట్ల గాంధీజీ జైనమత దృక్పథాన్ని ఆరెస్సెస్ భావజాలం నిరసిస్తుంది. మతం కంటే దేశానికే అగ్రతాంబూలం ఇస్తుంది. జైన, బౌద్ధ మతాలను భారతీయ మతాలుగా గుర్తిస్తోంది. మెజారిటీ ప్రజలైన హిందూ జాతి సాంస్కృతిక వైభవాన్ని గుర్తించి, వ్యక్తి సచ్ఛీలతకు, దేశభక్తికి పునాదులు వేస్తోంది. కానీ దళిత బహుజనుల సామాజిక న్యాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. వర్ణధర్మాలను(వృత్తి ధర్మాలను) భగవద్గీత గుణకర్మలతో ముడిపెట్టింది కానీ, పుట్టుకతో (Hereditary Profession) ముడిపెట్టలేదు. ఈ విధంగా భగవద్గీతలో చెప్పినదే ఆధునిక చింతన కూడా! కానీ మధ్యయుగాలలో అమలైన 'సవతీవసఙ్ఖుతీఎ ౯ాతీశీటవంంఱశీఅ'ను మాత్రమే ఆరెస్సెస్ స్థిరీకరించే ప్రయత్నం చేస్తోంది. ఇది హిందూ దళిత బహుజనుల సామాజిక న్యాయానికి పెనుప్రమాదం! కాబట్టి హిందూ దళిత బహుజనులు ఆరెస్సెస్ వైపు మొగ్గుచూపడం ఆరోగ్యకరం కాదు. ఆరెస్సెస్‌లోగానీ, దాని అనుబంధ రాజకీయపార్టీ బీజేపీలోగానీ వారిమత, సాంస్కృతిక ఆసక్తులు నెరవేరుతాయి కానీ, సామాజిక న్యాయం సమకూరదు.

ఇక రెండవది, లౌకికవాద నాస్తిక దృక్పథం. నాస్తికత్వం భౌతిక జీవితానికి తప్ప, అలౌకిక అన్వేషణకు ప్రాధాన్యం ఇవ్వదు, ఖండిస్తుంది కూడా. సెక్యులరిస్టులు కానీ, మార్క్సిస్టులు కానీ నాస్తికులైనవారు మతాన్ని అధ్యయనం చేయరు. అవసరం కూడా లేదు అనుకుంటారు. కానీ వీరికి మతం పట్ల గుడ్డి నిరాకరణ మాత్రం ఉంటుంది. ఇక్కడ ఒక ప్రమాదం పొంచివుంది. మతం గురించి తెలియనివాళ్లకు ఆ జాతి సంస్కృతి తెలియదు. సంస్కృతి తెలియనివాళ్లకు ఆ జాతి భావావేశాలూ అర్థం కావు. ఇటువంటి నాస్తిక మేధావుల మధ్య, వారి సంస్థలలో దళిత బహుజనుల మతభావాలు సహజంగానే దెబ్బతింటాయి. ప్రశ్నకు గురవుతాయి. దళిత బహుజనులకు తమ మతం పట్ల, తమ సంస్కృతి పట్ల ఉన్న భావావేశాలు, ఈస్థటిక్స్ నాస్తిక సమూహాల మధ్య సంతృప్తి పొందవు. ఈ విధంగా తమ సామాజిక న్యాయాన్ని విస్మరించిన ఆరెస్సెస్, బీజేపీ ఒకవైపు; తమ జాతినీ, సాంస్కృతిక అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసే నాస్తికవాదం మరొకవైపు–ఈ రెండూ హిందూ దళిత బహుజనులకు ఆమోదయోగ్యం కాలేవు. ఈ క్రమంలోనే దళిత బహుజనులు ఈ రెండు భిన్నధృవాలకు మధ్యస్థంగా, స్వతంత్రంగా ఆలోచించక తప్పదు. ఆరెస్సెస్ శక్తులకు, నాస్తికవాద శక్తులకు దూరంగా తమ హిందూ దళిత బహుజన అస్తిత్వాన్ని ఆవిష్కరించుకోవాలి. దళిత బహుజనుల్లో కొందరికి హిందూ పదాన్ని జోడించడమే ఇష్టం ఉండదు. అందుకు క్రిస్టియన్, ఇస్లాం మేధావులకు, లౌకికవాదులు, మార్క్సిస్టులకు ఎవరి కారణాలు వారికి ఉన్నాయి. క్రిస్టియన్ మేధావులకు హిందూ దళితుల పట్ల అసహనం ఉండవచ్చు. హిందూ మతం వారిని గుళ్లకు దూరం చేసినా, ఊరి బయటకు తరిమినా ఇంకా ఆ మతాన్నే పట్టుకుని వేలాడుతున్నారని కోపం ఉండవచ్చు. ఈ కోపం సకారణమే. కాబట్టి మనం అర్థం చేసుకోనూవచ్చు. దళితులు, దళిత క్రిస్టియన్లు హిందూమతం పట్ల రియాక్షనరీస్‌గా మారడం సహజమే. అందుకు మనుధర్మ శాస్త్రమే కారణం. దీనిని హిందూ సమాజం బహిష్కరించవలసిందే! ముస్లింల రియాక్షన్‌కు సామాజిక దౌష్ట్యాలు కారణం కాదు. హిందూమతం పట్ల వారి రియాక్షన్‌కు వారు నమ్మిన ఇస్లాం మతగ్రంథాలే కారణం. ముస్లింలు-- హిందూమతంలోని అస్పృశ్యతను ప్రశ్నిస్తారు. వర్ణధర్మాన్ని ప్రశ్నిస్తారు. మనుధర్మ శాస్త్రాన్ని దండిస్తారు. బ్రాహ్మణాధిక్యతను ఎత్తిచూపుతారు. ఈ విమర్శలన్నిటినీ హిందూ దళిత బహుజనులు ఆహ్వానిస్తారు, ఆమోదిస్తారు కూడా! మైనారిటీ మతాలతో హిందూ దళిత బహుజనులు సహజీవనాన్ని కోరుకుంటారు. సహజీవనానికి అవసరమైన సంస్కరణలను ఆ మతాల నుంచి కూడా ఆశిస్తారు. ముస్లింలు యుద్ధ జిహాద్‌ను ఖండించాలని, ప్రపంచాన్ని ఇస్లాం రాజ్యంగా మార్చాలనే అప్రజాస్వామికతను ప్రశ్నించాలని, అన్యమతాల పట్ల కాఫిర్లు అనే శత్రుభావాన్ని విడనాడాలని.. హిందూ దళిత బహుజనులు కోరుకుంటారు. వర్తమానంలో హిందూ, ఇస్లాం శక్తులకు ఎవరి రాజకీయాలు వారికి ఉన్నాయి. ఎవరి వ్యూహాలు వారికి ఉన్నాయి. 2030 సంవత్సరం అంటూ ఒకరు, 2047వ సంవత్సరం అంటూ ఒకరు తమ వ్యూహాలు అమలు చేయబోయే కాల నిర్ణయాలు కూడా జరిగిపోతున్నాయి. ఈ ప్రమాదానికి విరుగుడు ఆరెస్సెస్, బీజేపీలు కాదు. నాస్తిక మార్క్సిస్టులూ కాదు. హిందూ, అబ్రహామిక్ మతాల మధ్య అపోహలు లేని సహజీవనమే ఇప్పుడు కావలసినది. ఇందుకు అనుగుణంగా ఎవరి మతాలను వారు సంస్కరించుకోవలె, శుభ్రపరచుకోవలె, ప్రజాస్వామ్యీకరించుకోవలె! హిందూ దళిత బహుజనవాదం మధ్యయుగాల మతవ్యవస్థను నిరాకరిస్తుంది. తమ మతాన్ని ప్రజాస్వామ్యీకరించుకునేందుకు పోరాడుతోంది. బ్రాహ్మణాధిపత్యాన్ని అంగీకరించదు. అన్ని చారిత్రక కాలాల్లోనూ మతగ్రంథాలను కాపాడుతూ వచ్చిన బ్రాహ్మణుల చారిత్రక పాత్రను గుర్తిస్తుంది. దేశమా? మతమా? అంటే దేశానికే మొదటి ప్రాధాన్యం ఇస్తుంది! మతాల పండుగల్లోగానీ, గుళ్లల్లో, దర్గాల్లో, చర్చిల్లోగానీ.. అన్ని మతాల ప్రజలూ పాల్గొనే ఒక మహత్తర సన్నివేశాన్ని కలగంటుంది. తమకంటే ఎక్కువగా అణగదొక్కబడిన పీడితుల ప్రయోజనాలకే పెద్దపీట వేయవలె. ఆ తరువాతే తమ ప్రయోజనాలను గుర్తించుకోవలె. పీడనను నిర్వచించేది కులమూ కావచ్చు, కొన్ని సందర్భాల్లో ప్రాంతమూ కావచ్చు. పట్టణమూ, పల్లెటూళ్ల మధ్యగల అవకాశ వ్యత్యాసాలూ కావచ్చు. ఈ విశాల దృక్పథాన్ని కూడా హిందూ దళిత బహుజనవాదం ప్రోత్సహిస్తోంది. జాతీయ సంస్కృతిని పాటించడానికి ఏ మత సంస్కృతులూ, ఆచారాలూ అడ్డుపడే సందర్భాలు రాకూడదని కోరుకుంటోంది. పల్లె ప్రాంతాల్లోని మాదిగ, మాలల ఆధ్యాత్మిక హక్కుల పోరాటాన్ని మొదటి కార్యాచరణగా స్వీకరిస్తోంది. హిందూ దళిత బహుజనవాదం ఏకశిలా సదృశమైన మతాన్ని కోరుకోదు. వేదాలు, ఉపనిషత్తులు, శైవం, వైష్ణవం వంటి వాటిని కోరుకుంటుంది. ముక్కోటి దేవతలు, ఎల్లమ్మ, ముత్యాలమ్మ వంటి గ్రామదేవతలు, ఆదివాసీల దేవుళ్లు అన్నిటినీ హిందూ బహుళత్వంలో భాగంగా స్వీకరిస్తుంది. యోగులు, సాధువులు.. సూఫీలు, క్రిస్టియన్ సన్యాసులు.. అందరికీ పూజ్యభావంతో మోకరిల్లుతుంది. భారతీయ కులసమాజాన్ని ఒక ఆర్థికశాస్త్రంగా గుర్తిస్తుంది. తక్కువ కులాలకు తక్కువ ఆదాయ వృత్తులు, అగ్రకులాలకు ఎక్కువ ఆదాయ వృత్తులు సమాజంలో ఆర్థిక అగాథాలకు దారితీశాయని నమ్ముతుంది. మార్క్సిజాన్ని ఆర్థికశాస్త్రంగా పరిగణించి ప్రేరణపొందే అవకాశాలను పరిశీలిస్తుంది. ఆసక్తి ఉన్న హిందూ మేధావులకు ఇవన్నీ చర్చనీయాంశాలే. ముల్లాలు, పీఠాధిపతుల నుంచి కాకుండా ఒకనాటి మన దక్కన్ సంస్కృతి నుంచే స్ఫూర్తిని పొందుదాం. జనసామాన్యంలో మిణుకుమంటున్న సహజీవన కళను దేదీప్యమానం చేద్దాం. మన జాతీయ ఆసక్తులతో సంపూర్ణంగా ఐక్యం అవుదాం. హిందూ మతంలోని బహుళత్వం మాయం కాకుండా కాపాడుకునే బాధ్యత మన మేధావులదే!

# నీట్-2026లో వాగ్దేవి విజయవిహారం..
# 32 మందికి పైగా మెడికల్ సీట్ల దిశగా




**మహబూబ్‌నగర్, జూలై 18 (సమయం ప్రతినిధి):** నీట్ యూజీ-2026 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి నీట్ అకాడమీ మరోసారి అద్భుత విజయాన్ని నమోదు చేసి తన సత్తా చాటిందని అకాడమీ కరస్పాండెంట్ విజేత వెంకట్ రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి పోటీలో విద్యార్థులు సాధించిన ఫలితాలు అకాడమీ నాణ్యమైన బోధనకు నిదర్శనమని పేర్కొంటూ విజేతలందరినీ అభినందించారు. వన్ క్లాస్ ప్రత్యేక విధానం, ఇన్నోవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల సమిష్టి కృషితో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి సాధారణ విద్యార్థులను సైతం వైద్య విద్య దిశగా నడిపించగలిగామని ఆయన తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత కోచింగ్ అందించి వారి డాక్టర్ కావాలనే కలను సాకారం చేయడం వాగ్దేవి అకాడమీ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఈ ఏడాది అకాడమీ నుంచి 68 మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా, ధర్మ 554 మార్కులు, సిద్ధార్థ 465 మార్కులు, రబ్ షా 452 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. మొత్తం 32 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించే అవకాశాన్ని దక్కించుకోవడం పట్ల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. విద్యార్థుల విజయాలతో తల్లిదండ్రుల విశ్వాసాన్ని మరింతగా చూరగొన్నామని, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని విజేత వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ-నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావని రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ గీతాదేవి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి నందన్ రెడ్డి, అకాడమీ అడ్వైజర్ యాకూబ్, ఈఏపీసెట్ ఇన్‌చార్జి షాకీర్, పరీక్షల ఇన్‌చార్జి చెన్నయ్య, యాజమాన్య సభ్యులు కోట్ల శివకుమార్, సతీష్ రెడ్డి, నాగేందర్, రాఘవేంద్రరావు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ను గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలి: మంత్రి జూపల్లి

**పానగల్,వీపనగండ్ల, జూలై 18 :** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా సమర్థవంతంగా, వేగంగా పూర్తి చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. శనివారం పానగల్,వీపనగండ్లలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో మంత్రి సమీక్ష నిర్వహించి, ప్రక్రియ అమలుపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గ్రామాలవారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని మంత్రి సమీక్షించారు. కొన్ని గ్రామాల్లో ప్రక్రియ మందకొడిగా సాగుతోందని గుర్తించి, వెనుకబడిన గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి, వారిని ఫోన్‌లో సంప్రదించి ఓటరు నమోదుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయడంతో పాటు, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా అత్యంత సమర్థవంతంగా పూర్తి చేసిన బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందజేస్తామని మంత్రి ప్రకటించారు. తొలి బహుమతిగా రూ.10,000, ద్వితీయ బహుమతిగా



రూ.5,000 అందజేస్తామని తెలిపారు. ఈ ప్రోత్సాహకాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు...

# రాష్ట్ర పోలీసు క్రీడల్లో పతక విజేతలను అభినందించిన జిల్లా ఎస్పీ



**మహబూబ్‌నగర్, జూలై 18 (సమయం ప్రతినిధి):** 5వ తెలంగాణ రాష్ట్ర పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026లో పతకాలు సాధించి మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖకు గుర్తింపు తీసుకొచ్చిన పోలీసు క్రీడాకారులను జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని తన కార్యాలయానికి పిలిపించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించడం జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమన్నారు. విధి నిర్వహణలో సమర్థతతో పాటు క్రీడల్లోనూ అంకితభావంతో రాణించడం ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లా పోలీసు శాఖకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పతకాలు సాధించిన వారిలో మహిళా పోలీస్ కానిస్టేబుల్ రాధిక (డబ్ల్యూపీసీ-2405) ఆర్మ్ రెజ్లింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో మూడు బంగారు పతకాలు, ఇమ్రాన్ (ఏఆర్‌హెచ్‌సీ-373) బాడీ బిల్డింగ్‌లో రజత పతకం, భూత్పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన రాము (పీసీ-923) యోగా విభాగంలో రజత పతకం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన షోయబుద్దీన్ (పీసీ-2366) బాక్సింగ్‌లో కాంస్య పతకం సాధించారు. వీరందరినీ ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి విజయాలు ఇతర పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన విక్రమ్-1.. స్కైరూట్ బృందాన్ని ప్రశంసించిన ప్రధాని

మొదటి పేజీ తరువాయి

భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు మోదీ. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా ఎంఈవోలు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలి

**సమయం ప్రతినిధి జోగులాంబ గద్వాల జిల్లా :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగేలా విద్యా శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం విద్యార్థుల నమోదు పెరిగేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. తరగతుల వారీగా చేరికలు తగ్గిన పాఠశాలలను ఎంఈవోలు క్షేత్రస్థాయిలో సమీక్షించి, కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించి విద్యార్థుల నమోదును పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అల్పాహారం అమలవుతుండడమే కాక సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్న విషయాన్ని వివరిస్తూ విద్యార్థులను చేర్పించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదును ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు నమోదైన విద్యార్థుల వివరాలను వెంటనే యు డైస్ పోర్టల్‌లో నమోదు పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రీ-ప్రైమరీ విద్యను బలోపేతం చేసి ప్రతి కేంద్రంలో కనీసం 25 మంది చిన్నారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, లక్ష్యం సాధించని అధికారులపై చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు బోనఫైడ్, టీసీలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలను విద్యాశాఖ అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, బోధన,హాజరు, మౌలిక సదుపాయాల పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. కాంప్లెక్స్ హెచ్.యం, ఎంఈవోల క్షేత్రస్థాయి పాఠశాల సందర్శనల వివరాలను ప్రతి నెల 15వ తేదీలోగా తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అపార్ నమోదు పెరగాలని, ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు రెన్యువల్, కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు సహకరించాలన్నారు. విద్యార్థులకు యూనిఫాంల పంపిణీని వేగవంతం చేయాలన్నారు. కేజీబీవీ కోఆర్డినేటర్లు ప్రతి నెల 12 కేజీబీవీలను సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను తప్పనిసరిగా సమర్పించాలన్నారు. 100 శాతం ఎన్‌రోల్‌మెంట్ పూర్తైన కేజీబీవీల్లో ప్రవేశ ద్వారం వద్ద 'అడ్మిషన్స్ క్లోజ్డ్' బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# పాలమూరు విద్యా ఖ్యాతిని రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లిన రిషి మెడికల్ అకాడమీ : ప్రభుత్వ విప్





(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) : ఇటీవల విడుదలైన NEET-2026 ఫలితాల్లో రిషి మెడికల్ అకాడమీ ఒకే క్యాంపస్ నుంచి 125కు పైగా మెడికల్ సీట్లు సాధించి రాష్ట్ర విద్యారంగంలో సరికొత్త చరిత్ర సృష్టించడం పట్ల ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఘన విజయం ఒక్క విద్యాసంస్థ విజయమే కాకుండా యావత్తు మహబూబ్‌నగర్ జిల్లా గర్వించదగ్గ చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. ఒకప్పుడు ఉన్నత విద్య కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితిని మార్చి, ఉమ్మడి జిల్లా విద్యార్థులకు సొంత జిల్లాలోనే నాణ్యమైన విద్యను అందిస్తూ, నీట్ (NEET) వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు ఉత్తమ కోచింగ్ అందిస్తున్న రిషి విద్యాసంస్థలది గొప్ప సేవ అని కొనియాడారు. గత దశాబ్ద కాలంగా కార్పొరేట్ విద్యా వలసలను గణనీయంగా తగ్గిస్తూ, 1000కు పైగా మెడికల్ సీట్లను సాధింపజేసి వేలాది మంది విద్యార్థుల వైద్య విద్యా కలలను సాకారం చేసిన రిషి విద్యాసంస్థల చైర్‌పర్సన్ చంద్రకళ , డైరెక్టర్ వెంకటయ్యలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. విద్యా నాణ్యత, క్రమశిక్షణ, అత్యుత్తమ బోధన, ఫలితాల సాధనలో రిషి సంస్థలు చూపుతున్న అంకితభావం మహబూబ్‌నగర్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిందని ప్రశంసించారు. అనంతరం NEET-2026లో విశిష్ట ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించి, వారు భవిష్యత్తులో సమర్థులైన వైద్యులుగా ఎదిగి సమాజానికి నాణ్యమైన సేవలు అందించాలని, తమ విజయాలతో మహబూబ్‌నగర్ ఖ్యాతిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, రిషి విద్యాసంస్థల యాజమాన్యం, అధ్యాపకులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో కరువు పరిస్థితి నెలకొన్నందున
## రేషన్ షాపుల ద్వారా 9 రకాలు నిత్యావసర సరుకులను సప్లై చేయాలి : పి వో డబ్ల్యూ





(సమయం ప్రతినిధి దేవరకద్ర) : ప్రగతిశీల మహిళా సంఘం (POW) జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం నాడు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత మేఘమాల వెంకటగిరి వహించగా ముఖ్యవక్తలుగా పి నారాయణమ్మ టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సిహెచ్ రామచందర్ డివిజన్ నాయకులు సాంబశివుడు కొండారెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశంలో రాష్ట్రంలో ప్రభుత్వాల పాలన మహిళలపై అనేక దాడులు అత్యాచారాలు ఆర్థికంగా ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి 80 ఏళ్ల స్వాతంత్రంలో మనం సాధించినది ప్రజాస్వామ్యం అంటే ఇదా రోజు రోజుకు అభద్రతాభావంతో స్వేచ్ఛ స్వతంత్ర లేకుండా జీవిస్తున్న పరిస్థితి నెలకొన్నాయి ప్రజల ఆర్థిక పరిస్థితి రోజు క్షీణిస్తా ఉన్నది బేటి బచావో బేటి పడావో వికసిత్ భారత్ అని ప్రబోధించిన నాయకులు నేడు పేపర్ లీక్ అయితే దీని వలన చనిపోయిన విద్యార్థులకు కనీసం సానుభూతి కూడా చూపకుండా కఠినమైన దౌర్జన నిర్ణయాలతో ఈరోజు పరిపాలన కొనసాగుతుంది స్త్రీలకు సమాన హక్కులు మహిళా బిల్లులు ఏమాత్రం చిత్తశుద్ధి లేదు ఇటువంటి వాళ్ళు దేశభక్తి పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్నారు ప్రజలు కరువు కాటకాలతో పనులు దొరకక కనీసం అవసరాలు తీరని స్థితిలో ఉంటే కనీసం రేషన్ షాప్ ల ద్వారానైనా తొమ్మిది రకాల సరుకులను సప్లై చేయాలని కోరుతున్న. కోయిల్ సాగర్... పేరూరు లిఫ్ట్ ద్వారా సాగునీటిని రైతులకు అందించే చర్యలు చేపట్టాలని.. ఇండియా అమెరికా మధ్య జరిగిన ఒప్పందాలు రద్దు చేయాలని... సంపూర్ణ మధ్య నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ..నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది... POW మండల అధ్యక్షులుగా శారద కార్యదర్శిగా నాగేంద్రమ్మ సహకార దర్శిక అనిత ఉపాధ్యక్షులుగా మేఘమాల కోశాధికారి చంద్రకళ తో పాటు 13 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## ఇన్స్పైర్ మనక్ అవార్డులకు విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**6 నుంచి 12వ తరగతి విద్యార్థులు అర్హులు**
**సెప్టెంబర్ 15 వరకు ఆన్‌లైన్‌లో నామినేషన్ల స్వీకరణ**
**ఎంపికైన ప్రాజెక్టులకు రూ.10 వేల ప్రోత్సాహకం**

మహబూబ్‌నగర్, జూలై 18 (సమయం ప్రతినిధి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ నిర్వహిస్తున్న ఇన్స్పైర్ మనక్ అవార్డ్స్-2026-27కు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి తెలిపారు. ఈ నెల 15 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందని, దరఖాస్తుల సమర్పణకు సెప్టెంబర్ 15 చివరి తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లా సైన్స్ అధికారి శంశీర్ మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ తదితర అన్ని యాజమాన్యాల ఉన్నత ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ అవార్డులకు అర్హులని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి కనీసం ఐదు వినూత్న ప్రాజెక్టు ఆలోచనలను ఎంపిక చేసి www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సహాయం నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ఈ నిధులతో విద్యార్థులు తమ ప్రాజెక్టులను రూపొందించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని వివరించారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ 60 ప్రాజెక్టులను ఎంపిక చేసి ప్రత్యేక గుర్తింపు అందజేస్తారని చెప్పారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంపొందించే వినూత్న నమూనాలను రూపొందించేలా సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఉన్నత ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు తప్పనిసరిగా ఐదు ప్రాజెక్టులను అప్‌లోడ్ చేసి విద్యార్థులను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.

## చలో కలెక్టరేట్‌కు ముందు ఉద్రిక్తత.. తండాల్లో పోలీసుల హౌస్ అరెస్టులు



రంగారెడ్డి, జూలై 18 (సమయం ప్రతినిధి): సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ చేపట్టిన 'చలో కలెక్టరేట్' కార్యక్రమానికి ముందు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు తండాల్లో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకు పోలీసులు తెల్లవారుజామున నుంచే తండాల్లో మోహరించి పలువురు నాయకులు, గ్రామస్థులను హౌస్ అరెస్ట్ చేయడానికి ప్రయత్నించారు. దీంతో స్థానికులు, మహిళలు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు పెద్ద ఎత్తున చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సిద్ధమయ్యారు. అయితే రాత్రి నుంచే పోలీసులు నాయకులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని శేఖర్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన వీడియో సందేశంలో, నాయకులను అరెస్టు చేసినా భయపడవద్దని, ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. డంపింగ్ యార్డు ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, డంపింగ్ యార్డు ఏర్పాటు ఆపకపోతే, తమ ఆందోళనను అణచివేస్తే ఆత్మహత్యలకు కూడా వెనుకాడబోమంటూ పలువురు మహిళలు చేతుల్లో పురుగుల మందు డబ్బాలు పట్టుకుని పోలీసుల ఎదుట నిరసన తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసమే తమ పోరాటమని, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయవద్దని వారు ప్రభుత్వాన్ని కోరారు. కొత్తూరు మండలం వైఎం తండా పంచాయతీ పరిధిలోని పీసీకే తండాలో కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామస్థులు చలో కలెక్టరేట్‌కు సిద్ధమవుతుండగా పోలీసులు పలువురు నాయకులు, గ్రామస్థులను హౌస్ అరెస్ట్ చేశారు. ఈ చర్యను నిరసిస్తూ ఓ మహిళ పురుగుల మందు డబ్బాతో పోలీసుల ఎదుటకు రావడం కలకలం రేపింది. డంపింగ్ యార్డు ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని, ప్రజల మద్దతుతో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని పోరాట కమిటీ నాయకులు ప్రకటించారు.

## జిల్లా విద్యాశాఖలో అవినీతి ఆరోపణలు.. విచారణకు ఉన్నతాధికారుల ఆదేశాలు?

గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. జిల్లా విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉన్నతాధికారిపై కార్యాలయ సిబ్బంది చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్ఈ)ఆదేశాలతో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) విచారణ చేపట్టి పూర్తి నివేదికను అందజేయాలనీ ఆదేశాలు ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. జిల్లా విద్యాశాఖ అధికారిపై పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలతో పాటు కార్యాలయ నిర్వహణలో అవకతవకలకు పాల్పడుతున్నారంటూ సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. అదే విధంగా ఈ మధ్యనే ప్రైమరీ పాఠశాల సమగ్ర శిక్ష కింద 41 పాఠశాలలకు ఒక్క పాఠశాలకు లక్ష రూపాయల నిధులు మొత్తం 41 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తే ఎలాంటి టెండర్ లేకుండా ఏకపక్షంగా జిల్లా విద్యాశాఖ అధికారి తమకు అనుకూలంగా వున్నా సంస్థ కు కట్టబెట్టారానే ఆరోపణ కూడా వారి పై వున్నది. విచారణ నిమిత్తం అధికారులు తొందరలోనే జిల్లాకు వస్తున్నారన్న సమాచారం తో పరిణామాల మధ్య శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంబంధిత అధికారి హుటాహుటిన పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. విచారణ సమయంలో తమ వద్ద నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోలేదని అధికారులు విచారణ బృందానికి చెప్పాలని కొందరు పాఠశాలల యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారిపై గత కొంతకాలంగా వివిధ అంశాల్లో అనేక ఆరోపణలు వస్తున్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోలేదని విద్యావర్గాలు పేర్కొంటున్నాయి. విచారణ నిష్పాక్షికంగా జరిగి వాస్తవాలు వెలుగులోకి రావాలని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఆరోపణలపై వివరణ కోసం సంబంధిత అధికారిని పలుమార్లు సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ వారు అందుబాటులోకి రాలేదు. ఈ వ్యవహారం పై అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

## జిల్లా ఆసుపత్రిలో టీ-హబ్, రేడియాలజీ హబ్‌ను పరిశీలించిన డీఎంహెచ్‌వో
### ప్రజలకు నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందించాలని డా. ఏ. శ్రీనివాసులు సూచన



మహబూబ్‌నగర్, జూలై 18 (సమయం ప్రతినిధి): జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు శనివారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని టీ-హబ్, రేడియాలజీ హబ్‌లను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు, రోగులకు అందిస్తున్న ల్యాబ్ సేవలపై ఆరా తీసి సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజలకు నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. విధుల్లో సమయపాలన పాటిస్తూ సేవాభావంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. బి. శంకర్, డా. రాజు, సుభాష్ చంద్రతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## MSME ఆధ్వర్యంలో చేనేత కార్మికుల నమోదు



అమరచింత : అమరచింతలో MSME ఆధ్వర్యంలో చేనేత కార్మికుల కోసం ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహించబడుతోంది. చేనేత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని చేనేత సహకార సంఘం నూతన కమిటీ కోరారు. నమోదు చేసుకున్న కార్మికులకు Z సర్టిఫికెట్ వారి ఇంటి వద్దకే అందజేయడం జరుగుతుందని అమరచింత చేనేత సహకార సంఘం ప్రధాన కార్యదర్శి మేర్వ అనిల్ , కోశాధికారి మ్యాడమ్ కృష్ణయ్య తెలిపారు. ఈ గుర్తింపు కార్డు ద్వారా ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, రుణ సదుపాయాలు, రుణమాఫీ వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని వారు వివరించారు. అదేవిధంగా, అర్హులైన లబ్ధిదారులకు ఉచిత ఫైర్ గ్యాస్ సిలిండర్ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. అమరచింతతో పాటు పరిసర ప్రాంతాల చేనేత కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం డైరెక్టర్ మహంకాళి సులోచనమ్మ, చేనేత కార్మికులు తిరుమల నరసింహ, మాకాం నర్సింహులు, బాల్ కుమార్, అలాగే MSME అధికారులు పాల్గొన్నారు.

# పర్మిషన్లు లేకుండానే ‘చాపల చెరువు’ నిర్మాణం!

**‘అన్ని అనుమతులు ఉన్నాయి’ అంటున్న నిర్వాహకుడు..**
**కాగితాలు మాత్రం చూపడం లేదు!**
**‘నాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు ’.. తహసీల్దార్**
**ఇరిగేషన్ శాఖ కూడా అనుమతి ఇవ్వలేదని స్పష్టం**
**సహజ నీటి ప్రవాహానికి అడ్డంగా 70 శాతం పనులు పూర్తి!**
**‘చాపల చెరువు వద్దు.. పూర్తిగా డిస్మాంటిల్ చేయాలి’**
**నీరు కలుషితమై ఊరుచెరువు దారుణంగా మారే ప్రమాదం**





(సమయం ప్రతినిధి మక్తల్) : నర్వ మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ‘చాపల చెరువు’ నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సహజ నీటి ప్రవాహానికి అడ్డంగా భారీగా మట్టి తవ్వకాలు చేపట్టి ఇప్పటికే సుమారు 70 శాతం పనులు పూర్తి చేశారని ఇరు గ్రామాల రైతులు, గ్రామస్థులు ఆరోపించారు. సంబంధిత శాఖల నుంచి అనుమతులు లేవని చెబుతున్నా పనులు కొనసాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**‘అన్ని పర్మిషన్లు ఉన్నాయి’.. కాగితాలు ఎక్కడ?**

చాపల చెరువు నిర్మాణ ప్రాంతానికి ఇరు గ్రామాల ప్రజలు వెళ్లి పనులు చేపడుతున్న వ్యక్తిని నిలదీశారు. తాను అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే పనులు చేపడుతున్నానని ఆయన చెప్పినట్లు గ్రామస్థులు తెలిపారు. అయితే అన్ని అనుమతులు ఉన్నప్పుడు పర్మిషన్ కాగితాలు చూపించాలని కోరగా చూపించలేదని ఆరోపించారు. పర్మిషన్ తీసుకున్న వ్యక్తి సంబంధిత పత్రాలు చూపించడానికి ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు.

**‘నాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు ’**

ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అని తెలిపినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖ కూడా చాపల చెరువు నిర్మాణానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేసినట్లు తెలిపారు.

**అనుమతుల్లేకుండా 70 శాతం పనులు ఎలా?**

రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి అనుమతులు లేవని అధికారులు చెబుతున్నప్పటికీ.. పనులు మాత్రం ఇంత పెద్దఎత్తున ఎలా కొనసాగుతున్నాయని గ్రామస్థులు ప్రశ్నించారు. అనుమతులు లేకుండానే 70 శాతం పనులు పూర్తయ్యే వరకు అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ఈ నిర్మాణం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయో విచారణ జరిపి తేల్చాలని కోరారు.

**సామాన్యులు మట్టి కొడితే కేసులు.. ఇక్కడ చర్యలేవీ?**

ఇంటి నిర్మాణం కోసం సామాన్యులు మట్టి తరలిస్తే జేసీబీలు, ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి జరిమానాలు విధిస్తూ కేసులు నమోదు చేసే అధికారులు.. ఇంత పెద్దఎత్తున ఎలాంటి అనుమతులు లేకుండా పనులు జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ప్రశ్నించారు. “సామాన్యులు మట్టి కొడితే కేసులు.. ఇక్కడ మాత్రం భారీగా తవ్వకాలు జరుగుతున్నా చర్యలు ఎందుకు లేవు?” అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నీరు కలుషితమైతే ఊరుచెరువు పరిస్థితి దారుణం :** చాపల చెరువును ఈ ప్రాంతంలో నిర్మించవద్దని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ నిర్మాణం చేపడితే చాపల చెరువులోని నీరు నర్వ ఊరుచెరువులో కలిసే అవకాశం ఉందని, దీంతో ఊరుచెరువు నీరు కలుషితమై చెరువు మొత్తం దారుణంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడే ఊరుచెరువు నీటి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉన్నందున ఈ నిర్మాణాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

**‘చాపల చెరువు వద్దు.. పూర్తిగా తొలగించాలి’ :** ఉండ్యేకోడ్ గ్రామ పరిధిలోని కనీసం ఏడు చెరువులు నిండిన తర్వాత నర్వ పెద్ద చెరువుకు వచ్చే సహజ నీటి ప్రవాహానికి అడ్డంగా ఈ నిర్మాణం చేపడుతున్నారని రైతులు తెలిపారు. భవిష్యత్తులో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో పాటు, ఊరుచెరువు నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందువల్ల చాపల చెరువు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి, ఇప్పటికే చేపట్టిన నిర్మాణాన్ని పూర్తిగా డిస్మాంటిల్ చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి, రెవెన్యూ, ఇరిగేషన్, గ్రామ పంచాయతీ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చాపల చెరువు నిర్మాణాన్ని పూర్తిగా తొలగించి, సహజ నీటి ప్రవాహాన్ని కాపాడాలని గ్రామస్థులు కోరారు.





## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్ రెడ్డి ఉదారత - అభినందించిన ఎమ్మెల్యే



గద్వాల : గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యార్థం డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటుకు మరియు స్వచ్ఛమైన త్రాగునీటి అవసరాల కోసం శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత, సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖర్ రెడ్డి సహాయ సహకారాలు అందిస్తానని ప్రకటించి గొప్ప ఉదారతను చాటుకున్నారు. శనివారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు గదులు, సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలో త్రాగు నీటి సమస్య ఉందని, అలాగే డిజిటల్ క్లాస్ రూమ్ (IFP) ఏర్పాటు చేయాలని విద్యార్థులు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలోని విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఆధునిక ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (Interactive Flat Panel) డిజిటల్ క్లాస్ రూమ్ సౌకర్యాన్ని, అలాగే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆర్వో (=ా) ప్లాంట్ త్రాగునీటి వసతిని కల్పించడానికి బండ్ల రాజశేఖర్ రెడ్డి ముందుకు రావడంతో గద్వాల్ ఎమ్మెల్యే ఆయనను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి డిజిటల్ విద్యా వసతులను కల్పించేందుకు, మౌలిక వసతుల కల్పనలో భాగస్వాములైన శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్ రెడ్డి సేవా నిరతి ఎంతో అభినందనీయమన్నారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి అండగా నిలిచిన బండ్ల రాజశేఖర్ రెడ్డి కి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## “సర్”ప్రక్రియలో పాల్గొంటూనే ప్రజా సమస్యలు గుర్తించండి

**పెద్దమందడి మండలంలో విస్తృతంగా పర్యటించిన మాజీ మంత్రి**



వనపర్తి : మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా “సర్’ ’జరుగుతున్న విధానాన్ని పరిశీలిస్తూ ఈరోజు బి.ఆర్.ఎస్ శ్రేణులతో కలసి పెద్దమందడి మండలంలో విస్తృతంగా పర్యటించారు. చిలుకటోనీపల్లి, బలీదుపల్లి, వెల్ టూరు,మదిగట్ల, మోజర్ల,చిన్న మందడి,పెద్ద మందడి, జగత్పల్లి అల్లాకుల మండలంలో పెద్ద మునుగల్ చేడు చిన్నమునుగల్ చేడు బలీదుపల్లి కనుమనూరు గ్రామాలలో ఓటర్ జాబితా సవరణ జరుగుతున్న విధానాన్ని పరిశీలించి బి.ఆర్.ఎస్ శ్రేణులు,బి.ఎల్. ఓలు అర్హులైన ఓటర్స్ తుది జాబితాలో ఉండేవిధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కార్యకర్తలు ప్రతిరోజూ సర్ ప్రక్రియలో పాల్గొంటూనే ప్రజా క్షేత్రంలో సమస్యలు గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నిరంజన్ రెడ్డి వాకిటి.శ్రీధర్, వెంట జగదీశ్వర్ రెడ్డి, రఘుపతి రెడ్డి,వేణు యాదవ్,కుమార్ యాదవ్,అశోక్,సేనాపతి,పురుషోత్తంరెడ్డి, కురుమూర్తి,శ్రీనివాసులు, మొగిలయ్య, వెంకటన్న,ఆంజనేయులు,నరసింహ, హనుమంత్, బాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## 19వ డివిజన్ తిమ్మసాని పల్లి వార్డు లో డిప్యూటీ మేయర్ పర్యటన



మహబూబ్ నగర్ : మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శ్రీ మారేపల్లి సురేందర్ రెడ్డి(MSR) 19వ డివిజన్ పరిధిలోని తిమ్మసాని పల్లి ప్రాంతాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా వార్డులోని ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి(MSR) హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్స్ బి శ్రీలత తిరుమల వెంకటేష్,. వరలక్ష్మీ రమేష్ రెడ్డి, వాణి శ్రీ ప్రశాంత్, కే. దేవ్ లీ మేగ్య నాయక్, వర్ధ రవి, బోరం శేషి, కాటం రాజు, వెంకటస్వామి, హరీష్, కాలనీ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## కట్ట పోచమ్మ దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా : ప్రభుత్వ విప్

మహబూబ్ నగర్ : నగరం లోని కట్ట పోచమ్మ దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గణేష్ నగర్ లో కొలువైన కట్ట పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో TUFIDC నిధులు 25 లక్షల రూపాయలతో నిర్మించనున్న మల్టీ పర్పస్ షెడ్ నిర్మాణపు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అంతకుముందు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ దేవాలయ ప్రాంగణంలో అహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని మనసు కూడా చాలా ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. కాలనీ ప్రజలు నిత్యం ఇక్కడ వచ్చి అమ్మ వారి సన్నిధిలో సమయం గడపాలని సూచించారు.

## స్పెషల్ బ్రాంచ్ సమాచారమే జిల్లా భద్రతకు బలమైన కవచం : ఎస్పీ



వనపర్తి : స్పెషల్ బ్రాంచ్ విభాగం జిల్లా పోలీస్ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందని, క్షేత్రస్థాయిలో సిబ్బందికి అవసరమైన సమాచారాన్ని అందిస్తూ నేర నియంత్రణలో ముఖ్యమైన సహకారం అందిస్తోందని జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి తెలిపారు.బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు మరియు సిబ్బందితో జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి స్పెషల్ బ్రాంచ్ విభాగం పనితీరును ప్రశంసిస్తూ, మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్పెషల్ బ్రాంచ్ విభాగం జిల్లా భద్రతా వ్యవస్థలో కీలక స్థంభం స్పెషల్ బ్రాంచ్ అందిస్తున్న సమాచారంతో నేరాలను ముందుగానే అడ్డుకోవడం సాధ్యమవుతోంది. ఇదే ఉత్సాహంతో మరింత క్రమశిక్షణతో, పారదర్శకతతో పని చేస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి. ప్రతి పని సమయానికి పూర్తి చేయడం ద్వారా పోలీసుశాఖపై ప్రజల నమ్మకం మరింత పెరుగుతుందనిపాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియ, ఉద్యోగ (జీశీవి) వెరిఫికేషన్లు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ల జారీ, ఇతర విభాగాలకు సమన్వయంతో సహకారం అందించడం అన్ని అంశాల్లో స్పెషల్ బ్రాంచ్ పనితీరు ప్రశంసనీయమని ఎస్పీ అన్నారు ”ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, ఎస్సైలు, మంజునాథ్ రెడ్డి, నరేష్, పర్వతాలు, స్పెషల్ బ్రాంచ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సోనమ్ వాంగ్‌చుక్ శాంతియుత దీక్షపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించండి!

ఢిల్లీ : నీట్ పేపర్ లీక్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హామీ ఇవ్వాలని, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్‌మంతర్‌లో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ దీక్షా శిబిరానికి వందలాది మంది పోలీసులు చేరుకున్నారు. హైకోర్టు ఆదేశాల పేరుతో దీక్షలో పాల్గొన్న వారిని బలవంతంగా వ్యాన్‌లలోకి ఎక్కించి తరలించారు. హైకోర్టు ఉత్తర్వులను చూపించాలని కోరినా చూపకుండా, సోనమ్ వాంగ్చుక్‌ను బలవంతంగా అదుపులోకి తీసుకుని అనంతరం ఆసుపత్రికి తరలించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన ప్రతి పౌరుడి హక్కు. న్యాయమైన డిమాండ్లకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, నిరసనలను అణచివేసే మార్గాన్ని ఎంచుకోవడం తీవ్రంగా ఖండించదగిన విషయం. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరిపి, ఢిల్లీ పోలీసుల దౌర్జన్య చర్యలపై విచారణ జరగాలి. అలాగే విద్యార్థుల ఆందోళనలకు కారణమైన సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.



# విద్యార్థుల సంక్షేమంలో నిర్లక్ష్యానికి తావులేదు

**మైనార్టీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి జులై 18:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శనివారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా, వసతి, భోజన, ఆరోగ్య సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న జిల్లా కలెక్టర్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాలలోని వివిధ విభాగాలను సంద ర్శించిన కలెక్టర్ విద్యార్థుల వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ,....... రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యాసంస్థల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సమాజంలోని పేద, వెనుకబడిన, మైనార్టీ వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రభుత్వం గురుకుల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందన్నారు. విద్యార్థులు పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా విద్య, వసతి, పోషకాహారం, క్రీడలు, వైద్య సేవలు, ఆధునిక సౌకర్యాలు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. గురుకుల విద్యాసంస్థలు కేవలం విద్య బోధించే కేంద్రాలు మాత్రమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే వేదికలని పేర్కొన్నారు. ఇక్కడ చదువుతున్న ప్రతి విద్యార్థి అందుబాటులో ఉన్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర శ్రమ ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, మానసిక వికాసం, వ్యక్తిత్వ వికాసం, క్రీడా నైపుణ్యాల అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్యవంతమైన విద్యార్థులే మంచి ఫలితాలు సాధించగలరని పేర్కొంటూ, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతి విద్యార్థికి నాణ్యతతో అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. విద్యార్థుల ఆరోగ్యంతో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిం చడమే కాకుండా వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని వివిధ రంగాల్లో ప్రోత్సహించాలని, పోటీ పరీక్షలు, ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని వెలికితీసి ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, హాస్టల్ నిర్వహణ, పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, భద్రతా చర్యల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులు సురక్షితమైన, ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా స్పందనాత్మక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం వెచ్చిస్తున్న ప్రతి రూపాయి లక్ష్యానికి అనుగుణంగా వినియోగించబడాలని, గురుకుల విద్యాసంస్థలు విద్యా నాణ్యత, క్రమశిక్షణ, ఫలితాల పరంగా రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని అన్నారు. ప్రతి అధికారి, ప్రతి ఉపాధ్యాయుడు సేవాభావంతో పనిచేస్తే గురుకుల విద్యాసంస్థలు విద్యా నాణ్యతలో ఆదర్శంగా నిలిచేలా ప్రతి అధికారి, ప్రతి ఉపాధ్యాయుడు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట ఇంచార్జ్ మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరి, నాగర్ కర్నూల్ ఆర్ డి ఓ అర్చన, నాగర్ కర్నూల్ తహసిల్దార్ తబితా రాణి, ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగులను విస్మరించిన కాంగ్రెస్ సర్కార్..!
## ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం..



**హైదరాబాద్ :** హైదరాబాద్ సరూర్‌నగర్‌లో కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన లియువ సంగ్రామ సభకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా నిరుద్యోగులు, యువతను విస్మరించిందని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సభకు బయలుదేరే ముందు షాద్‌నగర్ చౌరస్తాలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత భవిష్యత్తు కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలోనే సురక్షితంగా ఉంటుందని పేర్కొంటూ, మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయడానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, బుచ్చిగూడ వెంకట్ రెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : జిల్లా ఎస్పీ డా. శబరీష్

**మహబూబాబాద్, జూలై 18, సమయం ప్రతినిధి :** జిల్లా ప్రజలు నకిలీ లోన్ యాప్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, వాట్సాప్ సందేశాల ద్వారా జరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ సూచించారు. తక్షణ రుణం, తక్కువ వడ్డీకి లోన్ ఇస్తామని నమ్మించి నకిలీ యాప్‌లు డౌన్‌లోడ్ చేయించడం లేదా మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ద్వారా నమోదు చేయించి ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా వివరాలు, ఫోటోలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ప్రాసెసింగ్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, ఇన్సూరెన్స్, జీఎస్టీ, ఫైల్ ఛార్జీలు పేరుతో డబ్బులు వసూలు చేసి రుణం మంజూరు చేయకుండా మరిన్ని చెల్లింపులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. కొన్ని సందర్భాల్లో వాట్సాప్ కాల్స్, సందేశాల ద్వారా బెదిరింపులకు కూడా పాల్పడుతున్నట్లు, 2026 సంవత్సరంలో ఇప్పటివరకు మహబూబాబాద్ జిల్లాలో నకిలీ లోన్ యాప్‌లకు సంబంధించి 95 ఫిర్యాదులు నమోదయ్యాయని, బాధితులు మొత్తం రూ.14,59,337 మేర ఆర్థిక నష్టాన్ని చవిచూశారని ఎస్పీ తెలిపారు. జూన్ నెలలో మాత్రమే 16 ఫిర్యాదులు నమోదై రూ.1,96,000 నష్టం జరిగినట్లు వివరించారు. పీఎం ముద్ర లోన్స్ కేంద్ర ప్రభుత్వ వ్యాపార రుణ పథకమని, ఈ రుణాల కోసం కేవలం గుర్తింపు పొందిన బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు లేదా అధికారిక ప్రభుత్వ పోర్టల్‌ల ద్వారానే దరఖాస్తు చేయాలని సూచించారు. అధికారిక విధానంలో వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు లేదా క్యూఆర్ కోడ్‌లకు ప్రాసెసింగ్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్ లేదా ఇతర అడ్వాన్స్ చెల్లింపులు చేయాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. ప్రజలు సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్, ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చే లోన్ ఆఫర్లను నమ్మవద్దని, తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని, గుర్తు తెలియని లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. అలాగే ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ, యూపీఐ పిన్, ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. బ్యాంకు ఖాతాలు, ఆన్‌లైన్ సేవలకు టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వినియోగించాలని, బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించి వాటిని కాలానుగుణంగా మార్చాలని సూచించారు.

## విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి : జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి



**మహబూబాబాద్, జూలై 18, సమయం ప్రతినిధి :** జాతీయ స్థాయి పరీక్షల పేపర్ లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. శనివారం మహబూబాబాద్‌లోని మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గత 20 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త, శాస్త్రవేత్త సోనం వాంగ్‌చుక్‌తో పాటు ఇతర నిరసనకారులను కేంద్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమై విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని రవి ఆరోపించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించలేదని విమర్శించారు. విద్యారంగం, రైతాంగం, కార్మికులు, యువజన సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజలను విభజించే రాజకీయాలు చేస్తోందని అన్నారు. జూలై 20న నిర్వహించనున్న "చలో పార్లమెంట్" కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. దేశవ్యాప్తంగా నిరసన ఉద్యమం మరింత ఉధృతం కానుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు బూర్గుల మోష, టీయూసీఐ జిల్లా నాయకులు బోయిన ఉప్పలయ్య, పీవైఎల్ జిల్లా నాయకులు ఈక శివకుమార్, సురేష్, రామచందర్, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

## రైస్ మిల్లు డ్రైవర్స్, హమాలీలకు ఉపాధి భద్రతతో
## కూడిన సమగ్ర చట్టంకై, సంక్షేమ బోర్డు ఏర్పాటుకై పోరాడుదాం



**(సమయం ప్రతినిధి వనపర్తి):** తెలంగాణ ప్రగతిశీల రైస్ మిల్ డ్రైవర్స్ & హమాలీ వర్కర్స్ యూనియన్ (TUCI) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈరోజు పెబ్బేరులో రైస్ మిల్స్ లో కరపత్రాలతో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పెబ్బేర్లో కార్మికులను ఉద్దేశించి TUCI జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్ డ్రైవర్లకు ఇతర మిల్లులో, గోదాములలో పనిచేస్తుంది కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పండే వరకు ప్రతి మనిషి ఉపయోగించే ప్రతి వస్తువుని ట్రాన్స్పోర్ట్ ద్వారా సప్లై అవుతుంది అంటే దాంట్లో హమాలీల శ్రమ దాగి ఉన్నది అలాంటి కార్మిక వర్గానికి భద్రతతో కూడిన సమగ్ర చట్టం తీసుకురావాలి, సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లు,దాల్, జిన్నింగుమిల్, స్పిన్నింగ్ మిల్లు ఆపరేటర్స్, మేస్త్రీర్లు, గుమస్తాలు, దినసరి కూలీలు పట్టి వాళ్ళకు చట్టాలు ఉన్న ఫ్యాక్టరీస్ యాక్ట్ ఉన్న, వీరితోపాటు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో పనిచేశారు హమాలీలకు పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాటివిటీ, ఇన్సూరెన్స్, బోనస్ చట్టాలు కూడా అమలు కాని దుస్థితి నేడు ఉందన్నారు. లేబర్ అధికారులు ప్రభుత్వ యంత్రాంగం పెట్టుబడిదారులకు దాసోహమై చట్టాలు అమలుకు నోచుకోలేదన్నారు. వీటి ఫలితంగా కార్మిక వర్గానికి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఎద్దేవ చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చే పని చేస్తున్న కార్మిక వర్గానికి భద్రత రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. 1967 ఐ ఎల్ వో నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్ డ్రైవర్లకు, హమాలీలకు కనీస పెన్షన్ 9000 ఇవ్వాలన్నారు. మిల్లులో ప్రమాదలకు గురై చనిపోయిన కార్మిక వర్గానికి 10 లక్షల నష్టపరిహారం, సహజ మరణానికి ఐదు లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఇల్లులేని డ్రైవర్లకు, హమలీలకు ఇతర కార్మికులకు ప్రభుత్వమే స్థలం ఇచ్చి డబల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులకు ప్రసూతి సెలవులు అమలు చేయాలి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం నిరంతరం పోరాడుతూనే ఉండాలని కార్మిక వర్గాన్ని కోరారు. ఈనెల 25న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాకు రైస్ మిల్ డ్రైవర్లు, మార్కెట్, రైస్ మిల్లు, బజారు, గ్రామీణ హమాలీలు అధిక సంఖ్యలో రావాలని కోరారు .ఈ ప్రచార కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు శ్రీను, పెబ్బేరు అధ్యక్షుడు వడ్ల శ్రీను ఉపాధ్యక్షులు అఫ్సర్, సహాయ కార్యదర్శి శేఖర్ రెడ్డి ,దేవన్న తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి



**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి జులై 18:** జిల్లా కేంద్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి చాంబర్‌లో అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి కొండారెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం చోటుచేసుకోకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ,...... రాష్ట్ర ప్రభుత్వం కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణాలు, రహదారులు, పారిశుద్ధ్యం, పచ్చదనం వంటి అనేక రంగాల్లో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. గ్రామ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజాధనం ఎంతో విలువైనదని, ఆ నిధులతో నిర్మిస్తున్న భవనాలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం లేదా నాణ్యత లోపాలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. గ్రామంలో కొనసాగుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి నిర్దిష్ట గడువులు ఉన్నాయని, ఆ గడువులను తప్పనిసరిగా పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లోపించకుండా పరస్పర సహకారంతో పనిచేస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో పూర్తవుతాయని పేర్కొన్నారు. ఏదైనా సాంకేతిక, పరిపాలనా లేదా ఇతర సమస్యలు ఎదురైతే వాటిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న కలెక్టర్, గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవన పనులను వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యా వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అదే విధంగా ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సొంత ఇంటి కలను సాకారం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు, గ్రామ సుందరీకరణ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేసి గ్రామ ప్రజలకు మరింత మెరుగైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు.పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రమైన గ్రామ నిర్మాణం వంటి అంశాల్లో కూడా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి శాఖ తనకు అప్పగించిన పనుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా కొండారెడ్డిపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా నిలపాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఈవో సీఈవో గోపాల్ నాయక్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమయం
ఆదివారం 19 జూలై 2026

# అన్ని కులాల అభ్యున్నతికి కృషి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం

(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : అన్ని కులాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి తెలిపారు. మహబూబ్ నగరంలోని కోయిల్‌కొండ ఎక్స్ రోడ్ వద్ద మున్సిపల్ నిధులు రూ.6.12 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆధునిక సదుపాయాలతో కూడిన మాడ్రన్ స్లాటర్ హౌస్ (జంతు వధశాల)ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా పట్టణంలో స్లాటర్ హౌస్ లేకపోవడంతో ఈ వృత్తిలో నిమగ్నమైన కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని, స్థానికంగా స్లాటరింగ్ చేసే కార్మికులతో చర్చించి, వారి అవసరాలకు అనుగుణంగా డిజైన్ రూపొందించి ఈ మాడ్రన్ స్లాటర్ హౌస్ నిర్మించామని తెలిపారు. కార్మికులకు సౌకర్యవంతంగా పని చేయడానికి అవసరమైన అన్ని వసతులను కల్పించినట్లు ఆయన చెప్పారు. ఇందులో పార్కింగ్ సదుపాయం, వెటర్నరీ డాక్టర్ సేవలు, విశ్రాంతి గదులు, నిరంతర నీటి సరఫరా వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే శుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, వ్యర్థాల నిర్వహణ కోసం ప్రత్యేక సంప్ (వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ఏర్పాటు చేసి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ ద్వారా ప్రధాన లైన్‌కు అనుసంధానం చేసినట్లు వివరించారు. ఈ స్లాటర్ హౌస్ ప్రారంభంతో పట్టణంలోని ఆరెకటిక , ఖురేషీ, వృత్తిదారులు మరియు ఇతరులకు దీర్ఘకాలంగా ఉన్న సమస్యకు




పరిష్కారం లభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇకపై నగరానికి చేరువలో ఉన్న మండలాల నుంచి కూడా నేరుగా ఇక్కడికి జంతువులను తీసుకురావడం సులభమవుతుందని తెలిపారు. ఈ జంతు వధశాల నిర్మాణంలో మధ్యలో వచ్చిన ఇబ్బందులను అధిగమించి, అవసరమైన అదనపు నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ సదుపాయాన్ని సంబంధిత వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్.పీ. వెంకటేష్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్ , కార్పొరేటర్లు ఉమర్ కొత్వాల్, ఫయాజ్, ఫకృద్దీన్, శ్రీలేఖ, రమేష్, ఖమర్, మహబూబ్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, మున్సిపల్ కమిషనర్ రామాంజులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కేసులోనూ నిందితులకు శిక్ష పడేలా కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ కృషి చేయాలి : జిల్లా ఎస్పీ




**కోర్టు విధులు సమర్థవంతంగా నిర్వర్తించడం వల్ల ఎక్కువ కేసులు పరిష్కారం**
**పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్లను పూర్తి పూర్తిగా అమలుచేయాలి**
**సాక్షులు, బాధితులను సమయానికి కోర్టుకు హాజరు పరచడంలో నిర్లక్ష్యం వద్దు**

వనపర్తి : కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచడం, తప్పు చేసిన నిందితులకు శిక్ష పడేలా చేయడం ద్వారా ప్రజలకు పోలీసుశాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, శనివారం రోజు జిల్లాపోలీసు కార్యాలయంలో కోర్ట్ లైజన్ , కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ లతో జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, సమావేశం నిర్వహించి కోర్టు కేసుల్లో శిక్షల శాతాన్ని పెంచడం, పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించడం, నిందితులకు చట్టపరమైన శిక్షలు ఖచ్చితంగా పడేలా చర్యలు తీసుకోవడంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... కోర్టు కేసుల్లో నిందుతులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ఇందుకు అనుగుణంగా కేసులు పెండింగులో లేకుండా చూసుకోవాలని అన్నారు. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి కేసు పూర్తయ్యేంతవరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలంను కోర్టుకు సమర్పించడంలో కోర్టు పోలీసు అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సూచించారు. సాక్షులను,బాధితులను సమయానికి కోర్టులో హాజరు పరిచేలా చూసుకోవాలని, బాధితులకు,సాక్షుల కు కేసుకు సంబంధించిన విషయాలలో అవగాహన కల్పించాలని అన్నారు. కోర్టు సమాచారం ప్రాసిక్యూషన్ కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత ఎస్సై లకు తెలియజేయాలని, అన్నారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించి పలువురు కోర్టు కానిస్టేబుళ్లను అడిగి కేసుల పురోగతిపై సూచనలు చేశారు. కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్స్,(NBW) సమన్స్ సమీక్షించి త్వరగా నాన్ బెయిలబుల్ వారెంట్స్ కోర్టులో హాజరుపరిచి NBW లను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, డిసిఆర్బి డిఎస్పీ, బాలాజీ నాయక్, డిసిఆర్బి ఎస్సై, తిరుపతి రెడ్డి, జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ల కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు శ్రీ పరమేశ్వరి స్వామి చెరువులో రాళ్ల డంపింగ్ తో ఆక్రమణ

**సర్వే నంబర్లు 46, 47లో అనుమతులు లేకుండా చెరువులో**
**రాళ్లు పోస్తున్న దృశ్యాలు వెలుగులోకి**
**తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు లేవని స్థానికుల ఆవేదన**

ఆత్మకూరు : వనపర్తి జిల్లా, ఆత్మకూరు.. మండలంలోని ఖానాపూర్ శివారులో ఉన్న శ్రీ పరమేశ్వరి స్వామి చెరువు పరిధిలో ఆక్రమణ యత్నానికి సంబంధించిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. సర్వే నంబర్లు 46, 47 పరిధిలో చెరువు ఆయకట్టు ప్రాంతంలో ప్రభుత్వ అనుమతులు లేకుండానే రాళ్లు పోస్తున్న దృశ్యాలు స్థానికులు చిత్రీకరించారు. చెరువు కానాపురం వైపు దిగువ భాగంలో ఉన్న ఆయకట్టు భూమిని విస్తరించుకునేందుకు భారీగా రాళ్లు డంప్ చేస్తున్నట్లు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నదని స్థానికులు చెబుతున్నారు. చెరువు నిల్వ ప్రాంతంలో రాళ్లు పోసి భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ విషయంపై ఆత్మకూరు తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు "మైన్స్ శాఖకు సమాచారం ఇచ్చాం... వాళ్లే వచ్చి అడ్డుకోవాలి" అంటూ బాధ్యతను మరో శాఖపైకి మళ్లిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. శ్రీ పరమేశ్వరి స్వామి చెరువు ఆయకట్టు ప్రాంతం రైతులకు సాగునీటి



ప్రధాన ఆధారం కావడంతో, ఇటువంటి ఆక్రమణలు కొనసాగితే భవిష్యత్తులో చెరువు నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు,వాటి ఆయకట్టు ప్రాంతాల పరిరక్షణ బాధ్యత అధికారులపై ఉందని, వెంటనే జిల్లా కలెక్టర్,రెవెన్యూ, మైన్స్, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి రాళ్లు పోస్తున్న పనులను నిలిపివేయాలని స్థానిక ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించేందుకు సమన్వయంతో పనిచేయాలి

సంగారెడ్డి, జూలై 18: జిల్లాలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ (Breast Cancer) కేసులను ప్రారంభ దశలోనే గుర్తించి, అనుమానితులను సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స కోసం రిఫర్ చేసే విధంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన SERP శాఖ, యునో బ్రెస్ట్ ఫౌండేషన్, గ్రాన్యూల్స్ ఇండియా, సంస్థల సమన్వయంతో రొమ్ము క్యాన్సర్ గుర్తింపు, ముందస్తు నిర్ధారణ కార్యక్రమాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పించడం, గ్రామ స్థాయిలో స్క్రీనింగ్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం, అనుమానిత కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసే వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స విజయవంతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, SERP తో పాటు సంబంధిత అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంత మహిళలకు రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు పరీక్షల అవసరంపై విస్తృత ప్రచారం నిర్వహించి, ఎక్కువ మంది మహిళలు స్క్రీనింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ శిబిరాల నిర్వహణలో ూజు-ౄా శాఖ, యునో బ్రెస్ట్ ఫౌండేషన్, గ్రాన్యూల్స్ ఇండియాకు అధికారులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

## మాట ఇచ్చినాం - ఖచ్చితంగా అమలు చేస్తాం : ప్రభుత్వ విప్



(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యోగులకు పాత పద్ధతిలోనే పెన్షన్ అమలు చేస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ప్రతినిధులు ఎమ్మెల్యేని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలనే సంకల్పం ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొంత వెసులుబాటు వచ్చిన తరువాత ఉద్యోగుల కు పదవీవిరమణ అనంతరం పాత విధానంలోనే పెన్షన్ అమలు జరిగే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని, అలాగే సీనియర్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించి ఉద్యోగుల డిమాండ్లు, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, టిఎన్జిఓ జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, నాయకులు చంద్ర నాయక్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఇమ్రాన్




మహబూబ్‌నగర్ : మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఇమ్రాన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. సందర్భంగా ఎమ్మెల్యే ఇమ్రాన్‌కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఇమ్రాన్ మాట్లాడుతూ, మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రజాసేవలో మరింత చురుకుగా పాల్గొనాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కొటకదిర సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, జమీర్, శాంతయ్య, ఎండి కైసర్ పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయంలో మంత్రి త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



అమరచింత : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గీత పారిశ్రామిక సహకార సంస్థ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనమేరకులిఈ రోజు అమరచింత మండల కేంద్రంలోని సింగంపేట గ్రామ అడవి ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి త్వరగా కోలుకొని మక్తల్ నియోజకవర్గం అభివృద్ధికి మరింత సేవ చేయాలని భగవంతుని ప్రార్థించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ణజజ జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్, అమరచింత పట్టణ అధ్యక్షులు రవికాంత్ , జిల్లా నాయకులు మహేందర్ రెడ్డి, అమరచింత మున్సిపాలిటీ చైర్మన్ జింక సువర్ణ రవి యాదవ్ ,sc సెల్ మండల అధ్యక్షులు జయప్రకాష్ , కౌన్సిలర్లు రాములు , కోప్షన్ మెంబర్లు తోఫిక్ , మార్కెట్ డైరెక్టర్ కమలాకర్ గౌడ్ , మాజీ ZPTC సభ్యులు వెంకటయ్య , కిసాన్ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి , st సెల్ మండల అధ్యక్షులు హనుమంత్ నాయక్ , మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి , గ్రామ అధ్యక్షులు జగన్ రెడ్డి , నర్సింహులు గౌడ్, బీసీ రెడ్డి , ఆనంద్ , రాజేష్ , పోతూ శ్రీధర్ , రంగాన ,రఫీ , ఆశువక్ , సత్య రెడ్డి , లక్ష్మణ్ , కృష్ణ నాయక్ , ముని , మహిపాల్ ,కురుమన , చిన్న , వీరేష్ గౌడ్ , రాకేష్ గౌడ్ , నరేష్ యాదవ్ ,సూర్య నాయక్ , పురుషోత్తం , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆడపిల్లల విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత : ప్రభుత్వ విప్

## కళాశాలలో గ్రంథాలయ అభివృద్ధికి 50 వేల చెక్కును అందజేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి






**(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) :** ఆడపిల్లల విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగరంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో టీయూఎఫ్ఐడీసీ (TUFIDC) నిధులతో రూ.25 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత తరగతి గదులు సరిపోకపోవడంతో కొత్త గదుల నిర్మాణం చేపట్టుతున్నామని తెలిపారు. ఈ నిర్మాణం పూర్తయిన తర్వాత విద్యార్థులకు విశాలమైన, సౌకర్యవంతమైన తరగతి గదులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ స్థాపనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బీఎస్సీ కంప్యూటర్స్‌తో పాటు ఇతర కోర్సుల విద్యార్థులు కూడా కంప్యూటర్ పరిజ్ఞానం పొందేందుకు సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. అదనంగా టాస్క్ సెంటర్ ద్వారా విద్యార్థులు వివిధ భాషలు నేర్చుకునే అవకాశాలు కల్పిస్తున్నామని, స్వల్పకాలిక శిక్షణా కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినులు వీటిని ఎక్కువగా వినియోగించుకుంటున్నారని అన్నారు. రాబోయే పోలీస్ నియామకాల నేపథ్యంలో కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు సిద్ధం కావాలని విద్యార్థులను ప్రోత్సహించిన ఎమ్మెల్యే, ఎన్‌సీసీ విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి రోజువారీ సాధన చేయాలని సూచించారు. రాబోయే నెలల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉండనున్న నేపథ్యంలో, ఫైనల్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులు ఇప్పటి నుంచే జనరల్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, మెంటల్ అబిలిటీ, రీజనింగ్ వంటి అంశాలలో ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. మహిళా విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఎంతోమంది అమ్మాయిలు విద్యను కొనసాగించగలుగుతున్నారని ఆయన తెలిపారు. అమ్మాయిలను చదివించడంలో వెనుకంజ వేయకుండా సమాన అవకాశాలు కల్పిస్తే వారు కుటుంబానికి, సమాజానికి ఆదారంగా నిలుస్తారని పేర్కొన్నారు. ఉచిత బస్సు పథకం విజయవంతమై అనేక మంది విద్యార్థినుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి కళాశాల గ్రంథాలయ అభివృద్ధికి తన సొంత నిధుల నుండి రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో అందజేశారు. ప్రతి సంవత్సరం రూ.50 వేల సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, హన్వాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, కార్పొరేటర్లు ఉమర్ కొత్వాల్, ఫయాజ్, అవేజ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకులు రమేష్ ముకుందం , మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజులు రెడ్డి,ఇంచార్ ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**మహబూబ్‌నగర్, జూలై 18 (సమయం ప్రతినిధి):** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లి లో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహ ప్రాంగణం, వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వసతి, భోజనం, పారిశుధ్యం, ఇతర సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని మౌలిక సదుపాయాలు నాణ్యంగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. అలాగే వసతి గృహంలో పరిశుభ్రతను నిరంతరం పాటిస్తూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

## పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆర్ఐ స్టోర్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**మహబూబ్‌నగర్, జూలై 18 (సమయం ప్రతినిధి):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) స్టోర్‌ను జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ శనివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి అవసరమైన యూనిఫాంలు, బూట్లు, బెల్టులు, క్యాపులు, రెయిన్‌కోట్లు, బ్యాడ్జీలు, ఇతర కిట్ సామగ్రి నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే స్టోర్‌లోని రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, జారీ–స్వీకరణ వివరాలు, వస్తువుల నిర్వహణ విధానాన్ని సమీక్షించారు. స్టాక్ నిర్వహణలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని ఎస్పీ సూచించారు. వినియోగానికి పనికిరాని సామగ్రిని నిబంధనల ప్రకారం తొలగించి, అవసరమైన వస్తువులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణకు అవసరమైన అన్ని సామగ్రి ఎలాంటి కొరత లేకుండా అందించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ తనిఖీలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణయ్య, నగేష్, ఆర్ఎస్ఐ సత్యం, స్టోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులను అవమానించిన ఆర్‌సీఓను తొలగించాలి

**మహబూబాబాద్, జూలై 18, సమయం ప్రతినిధి :** విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన రీజినల్ కో–ఆర్డినేటర్ ఆఫీసర్ (ఆర్‌సీఓ) రత్నకుమారి విద్యార్థులను ఉద్దేశించి చెప్పుతో కొడతా అంటూ వ్యాఖ్యానించారని, ఆమెను వెంటనే సర్వీస్ నుంచి తొలగించాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయికుమార్, రాష్ట్ర కోశాధికారి గూగులోతు సూర్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌సీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ సమస్యలను వినిపించేందుకు వచ్చిన విద్యార్థుల పట్ల ఆర్‌సీఓ రత్నకుమారి బాధ్యతారాహిత్యంగా, అహంకారపూరితంగా ప్రవర్తించారని ఆరోపించారు. విద్యార్థులను చెప్పుతో కొడతా అని వ్యాఖ్యానించడం విద్యార్థి లోకాన్ని తీవ్రంగా అవమానించడమేనని, ఈ ఘటనకు నిరసనగా డీఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్‌సీఓ కార్యాలయం ఎదుట చెప్పులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. రత్నకుమారిని తక్షణమే సస్పెండ్ చేయడంతో పాటు, సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆందోళన తీవ్రతరమవడంతో స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులతో చర్చించారు. విద్యార్థులు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు. సీఐ హామీతో నిరసనను తాత్కాలికంగా విరమించినప్పటికీ, ప్రభుత్వం తక్షణమే స్పందించి సంబంధిత అధికారిణిపై కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించాలి:పాఠశాల చైర్మన్ కే. చంద్రమౌళి



**మహబూబాబాద్, జూలై 18, సమయం ప్రతినిధి :** చిన్నారుల్లో రంగులపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించే లక్ష్యంతో గ్రీన్ కలర్ డే వేడుకలను నిర్వహించినట్లు చైర్మన్ కే. చంద్రమౌళి తెలిపారు. శనివారం మహబూబాబాద్ పట్టణంలోని స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో నిర్వహించిన గ్రీన్ కలర్ డే వేడుకల్లో చిన్నారులు ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి, పచ్చని ప్రకృతిని ప్రతిబింబించే వివిధ వస్తువులతో పాల్గొని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో బాల్యం నుంచే రంగుల ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు ప్రకృతి పట్ల ప్రేమ, పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆకుపచ్చ రంగు విశిష్టత, చెట్ల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని వివరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి మధు మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రకృతిపట్ల ప్రేమను పెంపొందించడం, చెట్ల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ముందుగా పాఠశాల ఆవరణను ఆకుపచ్చ రంగు బెలూన్లు, అలంకరణలతో సుందరంగా ముస్తాబు చేశారు. విద్యార్థులు పాటలు, పద్యాలు, ప్రసంగాలు, నృత్య ప్రదర్శనలతో తమ ప్రతిభను చాటుతూ ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కొట్లాడడమే తెలుసు.. అడుక్కోవడం తెలియదు



**సమయం ప్రతినిధి, నల్లగొండ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల భర్తీ, విస్తరణ ఊహాగానాల నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. మంత్రి పదవి దక్కకపోవడంపై ఆయన తనదైన శైలిలో తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కారు. తనకు పదవులు అడుక్కోవడం తెలియదని, కేవలం ప్రజల కోసం కొట్లాడటమే తెలుసంటూ అధిష్ఠానం తీరుపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. మంత్రి పదవి రాకపోవడంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు రాజగోపాల్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. "నాకు పదవులు అడుక్కోవడం తెలియదు.. కొట్లాడటమే తెలుసు" అని స్పష్టం చేశారు. గతంలో తాను కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మునుగోడు ఉప ఎన్నికకు వెళ్లిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. "నేను రాజీనామా చేసి ఉప ఎన్నికకు వెళ్తే, నన్ను ఓడించడానికి నా నియోజకవర్గానికి వంద మంది ఎమ్మెల్యేలు వచ్చారు" అంటూ నాటి రాజకీయ పరిస్థితులను, తనకున్న ప్రజాబలాన్ని ఆయన ఉదహరించారు. తన సోదరుడు, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఉద్దేశించి కూడా రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. "కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నేను సోదరులమే కావచ్చు.. కానీ మా కుటుంబాలు వేర్వేరు" అని స్పష్టం చేశారు. మంత్రి పదవి విషయంలో వెంకట్‌రెడ్డితో తనకు ఎలాంటి సంబంధం లేదని, ఆయనకు పదవి రావడం వల్ల తనను పక్కన పెట్టడం సరికాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం వ్యవహరించిన తీరుపై రాజగోపాల్‌రెడ్డి బహిరంగంగానే అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో గానీ, ఆ తర్వాత గానీ అధిష్ఠానం ఎవరికైతే ముందస్తుగా హామీలు ఇచ్చిందో, వారికే ఇప్పుడు మంత్రి పదవులు వచ్చాయని వ్యాఖ్యానించారు. "అధిష్ఠానం హామీ ఇచ్చిన వారికి మంత్రి పదవులు వచ్చాయి.. కానీ నాకు మాత్రమే మంత్రి పదవి ఇవ్వలేదు" అని నేరుగా తన అసంతృప్తిని బయటపెట్టారు. రాజగోపాల్‌రెడ్డి చేసిన ఈ సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సీనియర్ నేతగా, మునుగోడులో గట్టి పట్టున్న నాయకుడిగా ఉన్న రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను అధిష్ఠానం ఎలా పరిగణనలోకి తీసుకుంటుందో, రాబోయే రోజుల్లో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచి చూడాలి.

## సమాజంలో మహిళలు కూడా ఆర్థికంగా చెందాలి....

**సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా:** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలో దీూచీూ శీటటఅవెవ కార్యాలయం నందు గ్రామీణ స్వయం ఉపాధి మహిళలకు శిక్షణ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు హాజరయ్యారు.. ఎమ్మెల్యే గారి చేతులు మీదుగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. మహిళలు మాట్లాడుతూ ... గద్వాల ప్రాంతంలో గ్రామీణ స్వయం ఉపాధి యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నెలరోజులపాటు శిక్షణ నిర్వహించారు టైలరింగ్ బ్యూటీ పార్లర్ ఎంబ్రాయిడింగ్ శిక్షణ ఇవ్వడం జరిగింది నెల రోజుల్లో ఏది సాధ్యం కాదు కాబట్టి మరికొన్ని రోజులు శిక్షణ ఇప్పించి మాకు నైపుణ్యత వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు దీని ద్వారా నేర్చుకున్న ద్వారా భవిష్యత్తులో ఆర్థికంగా ఎదిగే విధంగా మాకు ఉపాధి కల్పించే విధంగా శిక్షణ కల్పించాలని కోరారు అదేవిధంగా ప్రభుత్వ నుండి వచ్చే సబ్సిడీ లో రుణాలలో మాకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.. ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ....ప్రస్తుతం సమాజంలో మహిళలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణించడం జరుగుతుంది. ప్రభుత్వం కూడా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు మహిళా గ్రూప్ పొదుపు సంఘాలలో ఉండడం వల్ల వాటి నుంచి వచ్చే డబ్బులను చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని మహిళలు ఆర్థికంగా బోలోపితం చెందాలి అని అన్నారు. గ్రామీణ ఉపాధి శిక్షణ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నెలరోజులు ఈ శిక్షణ ఏర్పాటు చేశారు దీనివల్ల మహిళలకు పూర్తి అవగాహన రాదు కాబట్టి మరోనెల రోజులు శిక్షణ ఏర్పాటు చేసి మహిళలు శిక్షణ పొంది ఎంబ్రాయిడింగ్, టైలరింగ్ బ్యూటీ పార్లర్ వాటిపై మంచి అవగాహన కల్పించి వారికి బతకడానికి సాధ్యమయ్యే విధంగా నైపుణ్యత ఉండాలి వారు భవిష్యత్తులో ఆర్థికంగా ఎదిగే విధంగా శిక్షణ పొంది విధంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా గద్వాల ప్రాంతంలో ఏదైనా ఒక మహిళలకు సంబంధించిన వస్తువులపై పెద్ద మొత్తన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా గద్వాలలో పలానా వస్తువు మహిళలకు లభిస్తుందని గద్వాల నుండి ఏదో ఎగుమతి దిగుమతి చేసే విధంగా వ్యాపారము పరిశ్రమను ఏర్పాటు చేయాలని వాటికి కావాల్సిన శిక్షణ మరియు ఆర్థికంగా ఏర్పాటు చేయడానికి నా వంతు కృషి చేస్తాం ప్రభుత్వం తరఫున కూడా కృషి చేసే విధంగా ప్రయత్నిస్తానని తెలిపారు. ప్రస్తుతం ఒక కుటుంబం జీవనం సాగించాలంటే కనీస 30000 రూపాయలు కావాలి మగవారు ఆడవాళ్ళు ఇద్దరు కలిసి పనిచేసినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.భవిష్యత్తులో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి నా వంతు పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.మున్సిపల్ చైర్ పర్సన్ గారు మాట్లాడుతూ .... గ్రామీణ ఉపాధి శిక్షణ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు మంచి సువర్ణ అవకాశం కల్పించడం జరిగింది. ప్రతి ఒక్క మహిళలు శ్రద్ధగా నేర్చుకొని నేర్చుకున్న వాటిని ఆచరణలో పెట్టి మహిళా పొదుపు సంఘాల ద్వారా రుణాలను తీసుకొని వ్యాపారాలు చేసుకోవాలి. గతంలో ఎంబ్రాయిడింగ్ చేతి ద్వారా చేయడం జరిగేది ఇప్పుడు మిషన్ల ద్వారా ఎంబ్రాయిడింగ్, బ్లౌజ్ ఫాల్స్, చేయడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు నేర్చుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీ నుండి మహిళలకు ఎటువంటి సహాయం కావాలన్నా ఎమ్మెల్యే గారికి సహకారంతో నా వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, వైస్ చైర్మన్ శంకర్, రాణవీ బ్యాంకర్ అధికారి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ బాబర్, వేదవతి వెంకటేశ్వర రెడ్డి, రామలింగేశ్వర కాంప్లే, చంద్రశేఖర్, గోవిందు, మాజీ కౌన్సిలర్ మురళి, నరహరి గౌడు,ఇసాక్, నాయకులు గోవిందు, వంట భాస్కర్ సుదర్శన్, ప్రవీణ్, రిజ్వాన్, మోసిన్, ఇలియాజ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికుల కడుపునిండే కొత్త పాలసీ కావాలి

**కార్మికుల సంక్షేమం విస్మరిస్తే పుట్టగతులుండవ్.**
**కనీస వేతనం 26 వేలకు పెంచాలి.**
**పి సురేష్ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి.**

**మహబూబ్ నగర్ :** ప్రభుత్వ ఆసుపత్రులలో కాలం చెల్లిన పాత ఏజెన్సీలను రద్దుచేసి కాంట్రాక్టు పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికుల కడుపు నింపే కొత్త పాలసీ కావాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మెడికల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో కాంట్రాక్ట్ పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ విభాగాల కార్మికుల సర్వసభ్య సమావేశం రంగన్న అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ:- కార్మిక వర్గ సంక్షేమం విస్మరించిన ఏ పాలకులకు పుట్టగతులు ఉండవని జోష్యం చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కనీస వేతనాలకు నోచుకోక అనేక ఆర్థిక ఇబ్బందులతో రోగుల మలమూత్రాలు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుల జీవితాలు మాత్రం మురికి కూపాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ విధానమే బూటకమని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కొస్తే ఏజెన్సీల వ్యవస్థను, థర్డ్ పార్టీ పాలసీలను ధ్వంసం చేస్తూ కాంట్రాక్టు ఎంప్లాయిస్ కు కార్మికులకు కార్పొరేషన్ వ్యవస్థ తీసుకొచ్చి నేరుగా ప్రభుత్వమే వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినప్పటికీ నేటికీ అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాలం చెల్లిన ఏజెన్సీలను రద్దు చేసి కనీస వేతనం 26,000 పెంచుతూ న్యూ టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి వెంటనే ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. జీతాల పెంపుకై ఇప్పటికే అనేక రకాల ఆందోళనలు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. జులై 9న నిర్వహించిన చలో డీఎంఈ కార్యాలయానికి వేలాదిమంది కాంట్రాక్ట్ కార్మికుల ప్రభుత్వ తీరుపై అధికారుల ఉదాసీనత వైఖరి నిరసిస్తూ తరలివచ్చి జరిగిన మిలిటెన్సీ ఆందోళననే నిదర్శనమని



అన్నారు.జనరల్ ఆస్పత్రికి తగినంత కార్మికులు లేరని దీని ఫలితంగా కార్మికులపై అదనపు పని భారం పడుతుందని, తగినంత పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సిబ్బంది లేకపోతే ఆసుపత్రి పరిశుభ్రత, భద్రత,రోగి సంరక్షణ ఎలా సాధ్యమౌతుందని అన్నారు. జీతాలు పెంచే వరకు ఆసుపత్రి కార్మికుల పోరాటం ఆగదని,ప్రభుత్వం మానవత దృక్పథంతో తక్షణమే జీతాలు పెంచే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు కార్మికులు ఎస్.దేవానంద్, బి. చెన్నయ్య,బాలకోటి,జే నరసింహ,బాలరాజ్, అంజయ్య,నైసన్,యుగేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, శంకర్,బాలరాజ్, ప్రకాష్,రామకృష్ణ, టంకర వెంకటన్న, వీరాంజనేయులు,మున్నా,మహేష్, మన్యం,రాఘవేందర్,అంజి, గంగాధర్,కృష్ణ, వెంకటేష్, పద్మమ్మ,సత్యమ్మ,,సువర్ణ,నాగమణి, రేణుక, వెంకటమ్మ,చంద్రకళ, సునీత,వరలక్ష్మి, లక్ష్మి,జ్యోతి,లక్ష్మమ్మ,మల్లమ్మ, శిరీష,ఎల్లమ్మ, సాయమ్మ,కవిత, జమున,భాగ్యమ్మ, నిర్మల,పద్మ,యాదమ్మ, చంద్రకళ,గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథ రథయాత్రతో భక్తిరసంలో మునిగిన జడ్చర్ల

### తొలిసారి ఇస్కాన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహణ.. రథాన్ని లాగిన మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, జూలై 18: సమయం ప్రతినిధి :** జడ్చర్ల లో శనివారం శ్రీ జగన్నాథస్వామి నామస్మరణతో మారుమోగింది. ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం భక్తుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా సాగింది. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని ఆశీర్వాదాలు పొందారు. రథయాత్రను మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి రథం తాడును లాగుతూ భక్తి పారవశ్యంలో పాల్గొన్నారు. మంగళవాయిద్యాలు, హరినామ సంకీర్తనలు, భజనల మధ్య సాగిన రథయాత్ర ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ, జగమంతటికీ అధిపతి అయిన శ్రీ జగన్నాథస్వామి రథయాత్రను ప్రారంభించడం, వేడుకల్లో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. ఈ పవిత్ర రథయాత్రలో పాల్గొన్న ప్రతి భక్తుడిపై స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, పంటలు బాగా పండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటున్నానన్నారు.జడ్చర్లలో తొలిసారిగా జగన్నాథ రథయాత్రను నిర్వహించిన ఇస్కాన్ సంస్థను ఆయన అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని, అందుకు తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మహోత్సవంలో ఇస్కాన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు, మహిళలు, యువతతో పాటు వేలాది మంది భక్తులు పాల్గొని రథయాత్రను విజయవంతం చేశారు.

## "నా ఓటు - నా హక్కు".. SIRలో పాల్గొన్న మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, జూలై 18 సమయం ప్రతినిధి:** జడ్చర్ల పట్టణంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన ఓటరు వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో స్వయంగా నమోదు చేసి సంబంధిత బీఎల్‌వోకు అందజేశారు. అనంతరం SIR ప్రక్రియ అమలవుతున్న తీరుపై బీఎల్‌వోను అడిగి తెలుసుకున్న ఆయన, ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించే విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటు ఎంతో విలువైనదని మాజీ మంత్రి పేర్కొన్నారు. "నా ఓటు - నా హక్కు" అనే భావనతో ప్రతి ఓటరు SIR కార్యక్రమంలో భాగస్వామి కావాలని, ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా పూర్తి చేసి బీఎల్‌వోలకు అందజేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## సబ్‌రిజిస్ట్రార్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

**జిల్లా పరిషత్ కార్యాలయం వెనుక ప్రభుత్వ భూమిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి జులై 18:** నాగర్‌కర్నూల్ జిల్లాకు నూతనంగా మంజూరైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శనివారం అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఆర్డీవో అర్చన, రెవెన్యూ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లా పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ భూమిని సందర్శించిన కలెక్టర్, భవన నిర్మాణానికి ఆ స్థలం అన్ని విధాలా అనుకూలంగా ఉందా అనే అంశాలను సంబంధిత అధికారులతో కలెక్టర్ కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల విస్తీర్ణం, ప్రభుత్వ భూమి సరిహద్దులు, అనుసంధానం, ప్రజలకు రాకపోకల సౌలభ్యం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరణ అవకాశాలు, సదుపాయాల లభ్యతపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని కలెక్టర్ నాగర్కర్నూల్ తహసిల్దార్ ను ఆదేశించారు. నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం ఆధునిక సౌకర్యాలతో నిర్మించబడేలా అనువైన స్థలాన్ని మంజూరుకు కావలసిన ప్రతిపాదనలను చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు, సాంకేతిక అనుమతులు, స్థలానికి సంబంధించిన రికార్డులు, ఇతర పరిపాలనా ప్రక్రియలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలో ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రత్యేక భవనం నిర్మించడం ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందుబాటులోకి వస్తాయని, భవనం పూర్తయిన తర్వాత ప్రజలు ఒకే చోట అన్ని రిజిస్ట్రేషన్ సేవలను సౌకర్యవంతంగా పొందగలరని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, నాగర్ కర్నూల్ తాహసిల్దార్ తబితా రాణి, సబ్ రిజిస్టార్ ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

## కేజీబీవీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి (జులై 18):** నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై తక్షణమే పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఐజూా రమేష్ కి ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ శాంతన్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట కస్తూర్బా బాలికా విద్యాలయములో చోటుచేసుకుంటున్న పరిణామాలు కె. పుష్పలత, ఎ.ఎన్.యం. గారు వారి యొక్క నైట్ డ్యూటీలో విద్యార్థినులతో తలకు నూనె పెట్టించుకొని మసాజ్ చేయించుకోవడము, రాత్రి వేళల్లో విద్యార్థినులతో చపాతీలు చేయించుకోవడము చూసిన కొందరు విద్యార్థినులు అప్పటి పాఠశాల ప్రత్యేక అధికారికి సమాచారము ఇవ్వడముతో సి.సి. ఫుటేజ్ వివరాలతో దాదాపు 2 నెలల క్రితమే తమరికి ఫిర్యాదు ఇచ్చినట్లు సమాచారము. ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. ఈ నెల 9వ తేదీన పాఠశాలలో హెల్త్ డిపార్ట్మెంట్ వారు 14 సం॥రాల లోపు విద్యార్థినులకు HPV (Human Papillomavirous vaccine వేసిన కార్యక్రమములో ఎ.ఎన్.యం. పాల్గొనలేదని సమాచారము.వంట మనుషులు, అటెండర్ పాఠశాలలోని విద్యార్థినులకు పంచాల్సిన గుడ్లను, పండ్లను మరియు నాన్వెజ్ చికెన్ మరియు మటన్ ను టిఫిన్ బాక్సులు, కవర్లలో పెట్టుకొని తీసుకువెళ్తున్నట్లు అప్పటి పాఠశాల ప్రత్యేక అధికారిణి సి.సి. ఫుటేజ్ వివరాలతో దాదాపు 2 నెలల క్రితమే తమరికి ఫిర్యాదు ఇచ్చినట్లు సమాచారము. ఇంతవరకు చర్యలు తీసుకోలేదు కె. కవిత, కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్ విద్యార్థినులకు ఎలాంటి కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించకుండా విద్యార్థినులకు ఆన్లైన్ ద్వారా బట్టలు, వాచీలు ఇతర వస్తువులు బుక్ చేసి తెప్పించి అధిక ధరలకు అమ్ముచున్నట్లు మా దృష్టికి వచ్చినది. అదే విధముగా కొన్ని రోజుల క్రితము ఆర్.జె.డి. పాఠశాలను సందర్శించిన సందర్భములో పాఠశాలలో మీటింగ్ పెట్టి విద్యార్థులకు విషయాలు చెప్పుకుంటూ జిల్లాలో పనిచేసిన ఒక అధికారి తప్పు చేయడము వల్ల అతనిని జిల్లా నుండి పంపివేయించడము జరిగింది అని చెప్పిన మాటలన్నింటిని తన మొబైల్లో లో రికార్డింగు చేసి స్టాఫ్ గ్రూప్ పెట్టి ఆ అధికారికి పంపించడము జరిగినది. ఇట్టి విషయాలన్ని ఆర్. జె.డి. దృష్టిలో, డి.ఇ.ఒ. దృష్టిలో ఉన్నా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. 3) ఈ నెల 3వ తేదీన కుమ్మెర గ్రామానికి చెందిన కె. సహర్ష మరియు కె. అవిక ఇద్దరు విద్యార్థినులను పాఠశాలలోని సిబ్బంది ఇబ్బంది పెట్టడము వలన అర్ధరాత్రి ప్రహరీగోడ దూకి బస్టాండుకు చేరుకొని బస్సు ఎక్కి ఉదయము 6 గంటల వరకు నాగర్కర్నూల్ చేరుకున్నారు. నాగర్ కర్నూల్ బస్టాండులో తెలిసిన వారు వారి తల్లిదండ్రులకు సమాచారము ఇవ్వడముతో వారు నాగర్ కర్నూల్ బస్టాండుకు వచ్చి తమ పిల్లలను ఇంటికి తీసుకొని వెళ్ళి మా పిల్లలు ఇంటికి వచ్చినారని పాఠశాలకు సమాచారము ఇచ్చే అంత వరకు కూడా ఆ రోజు డ్యూటీలో ఉన్న నైట్ వాచఉమెన్కు గాని, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్కు గాని ఇట్టి విషయము తెలియదు. ఇట్టి విషయము మీ దృష్టిలో ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోలేదు. ఈ నెల 9వ తేదీన పాఠశాలకు చెందిన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అధికారులకు సమాచారము ఇవ్వకుండా పాఠశాలను జిల్లా కలెక్టర్ కార్యాలయనకు వెళ్ళినట్లు సమాచారము ఉన్నది. ఆ రోజు పాఠశాలలో మాథ్స్ టీచర్ ఒక్కరే డ్యూటీలో ఉన్నట్లు సమా చారము.






OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085